సాక్షి ఒడిశా

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,30,276లు, బంగారం 6 గ్రాముల 450 మిల్లీగ్రాములు, వెండి 24 గ్రాముల 850 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఒక బృందావనం.. సోయగం

పూరీ జగన్నాథుడి శ్రీమందిరంలో వానా కాలపు జాతరల్లో ఒకటిగా పేరొందిన ఊంజల యాత్ర శనివారం నుంచి ప్రారంభమైంది. మొత్తం వారం రోజులపాటు కొనసాగుతుంది.

- 8లో.



భారీగా గంజాయి స్వాధీనం

రాయగడ జిల్లాలో శనివారం భారీగా గంజాయి పట్టుబడింది. వివిధ మార్గాల ద్వారా తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో.

న్యూస్‌రీల్

బాబోయ్ భల్లూకం



పాఠశాలకు సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

జయపురం: బొయిపరిగుడ సమితి ఖెందుగుడ పంచాయతీ బొడొనాయికగుడ ప్రాథమిక పాఠశాలలోకి శనివారం మధ్యాహ్నం ఒక ఎలుగుబంటి చొరబడింది. దీంతో పాఠశాలలోని విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. అయితే ఎలుగుబంటి సాదు జంతువులా ప్రవర్తించడం ఆశ్చర్యం కలిగించింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు దూరం నుంచే బిస్కెట్లు, అరటి పండ్లు, ఇతర పదార్థాలను అందించారు. విషయం తెలిసి ఎలుగుబంటిని చూసేందుకు గ్రామ ప్రజలు పోటెత్తారు. ఎలుగుబంటి పరిస్థితిని గమనించి అస్వస్థతతో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అనంతరం అటవీ విభాగం అధికారులకు తెలియజేశారు. వెంటనే అటవీ సిబ్బంది వచ్చి గ్రామస్తుల సహకారంతో ఎలుగుబంటిని పట్టుకొని బొయిపరిగుడ పశు చికిత్స కేంద్రానికి వైద్య పరీక్షలకు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం చికిత్స అందించి అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని సిబ్బంది వెల్లడించారు.

బావిలో పడిన మేకలు



బావిలో పడివున్న మేకలు

రాయగడ: జిల్లాలో రామనగుడ సమితి పాత సెరమ గ్రామ సమీపంలోని ఒక అడవికి మేతకు వెళ్లిన 12 మేకలు నేలబావిలో పడిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. మేకల యజమాని పి.తవిటినాయుడు ఎప్పటిలాగే శనివారం ఉదయం తన మేకలను మేతకు తీసుకెళ్లాడు. అనంతరం అతను ఒక చెట్టుకింద సేద తీరుతుండగా కొంతసేపటికి మేకలు కనిపించకపోవడంతో వెదకడం ప్రారంభించాడు. కొద్ది దూరంలో ఉన్నటువంటి నీరులేని నేలబావి నుంచి మేకల అరుపులు రావడంతో వెళ్లి చూశాడు. అందులో మేకలు పడడం గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో రామనగుడ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మేకలను బయటకు తీశారు. కొన్ని మేకలు తీవ్రంగా గాయపడడంతో పశువైద్య కేంద్రానికి చికిత్స కోసం తీసుకెళ్లారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పోలీసుస్టేషన్ పరిధి గుంతిలి గ్రామంలో ఒక వివాహిత ఆత్మహత్యకు సంబంధించి ముగ్గురు నిందితులను గుణుపూర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈనెల 23వ తేదీన వర్షారాణి మహంతి (20) అనే వివాహిత అత్తవారింటి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంగతి పాఠకులకు విదితమే. తన కూతురు చావుకు అత్తవారే కారణమని వర్షారాణి తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు వర్షారాణి భర్త రఘునాథ్ పాత్రో, అత్త బసంత మంజురి పాత్రో, మామ కాసీనాథ్ పాత్రోలను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. రెండు నెలల క్రితమే వీరికి వివాహం అయ్యింది.

పట్టుబడిన కొండచిలువ



జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి రణస్‌పూర్ గ్రామంలో శనివారం 12 అడుగుల కొండ చిలువ పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. రణస్‌పూర్ గ్రామంలో శశి తండి ఇంటిలోకి కొండచిలువ ప్రవేశించింది. దీనిని గమనించిన ఇంటిలోని వ్యక్తులు బయటకు వచ్చి చుట్టుపక్కలవారికి తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులకు సమాచారం అందించారు. స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులు వచ్చి కొండచిలువను బంధించి అటవీ విభాగ అధికారులకు అప్పగించారు. కొండచిలువను అడవిలో విడిచిపెడతామని అధికారులు వెల్లడించారు.

రిమాండ్‌కు ఇవ్వాలని కోర్టుకు వినతి


జయపురం: స్థానిక గంగానగర్‌లో స్వర్గీయ మహేంద్రసింగ్ ఇంటిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నటువంటి జితు సోనిని పట్టణ పోలీసులు రిమాండ్‌కు తీసుకు రానున్నారు. ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రంలో మోస్ట్ వాంటెండ్ క్రిమినల్ అయిన జితు సోనిని జగదల్‌పూర్ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు పంపారు. అతడిని రిమాండ్‌కు తీసుకొచ్చేందుకు జయపురం పట్టణ పోలీసు అధికారులు జగదల్‌పూర్ కోర్టును కోరినట్లు పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో వెల్లడించారు.

ఎదురులేని... వెదురు కళ





వెదురును ముక్కలు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్లో) వెదురు ముక్కలను నున్నగా చేస్తున్న యువతులు



వెదురుతో రూపొందించిన రాఖీలు

- అద్భుతాలు సృష్టిస్తున్న ఆదివాసీ యువతులు
- మహిళలను ఆకట్టుకునే కళాకృతులు తయారీ
- వివిధ డిజైన్లతో రాఖీలు
- సహకారం అందిస్తున్న స్పర్శ స్వచ్ఛంద సంస్థ

రాయగడ: జిల్లా కేంద్రానికి సుమారు 10 కి.మీ దూరంలోని ఉన్నటువంటి చందిలి గ్రామంలో స్పర్శ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోత్సాహంతో ఆదివాసీ యువతులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. ముఖ్యంగా మహిళల మెడలో అలంకరించుకునే ఆభరణాలను వెదురుతో రూపొందించి ప్రతిభ చాటుకుంటున్నారు. మూడేళ్ల క్రితం ఈ సంస్థ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. చందిలి పరిసర ప్రాంతాలైన బాకురుగుడ, అగురు, బొడొ చందిలి, జేకేపూర్ ప్రాంతాలకు చెందిన సుమారు 20 మంది వరకు ఆదివాసీ యువతులు వెదురుతో వివిధ కళాకృతులు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ పండగను పురస్కరించుకొని వేర్వేరు రకాల రాఖీలను తయారు చేస్తున్నారు. గతేడాది నుంచి రాఖీలను తయారు చేస్తూ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు నిర్వాహకురాలు మమత హుయిక తెలియజేశారు.

మంచి గిరాకీ

ఇదిలాఉండగా వెదురుతో మహిళలు వేసుకునే మెడలో అలంకారాలకు రాష్ట్రంలోని భువనేశ్వర్, కటక్, పూరీ వంటి ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడ రూపొందించిన కళాకృతులను ఒడిశా రూరల్ డవలప్‌మెంట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ (ఒర్మాస్) సంస్థ సహకారంతో ఆయా ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. అదేవిధంగా రాయగడతో పాటుగా ఎక్కడైనా ఎగ్జిబిషన్‌లు వంటివి ఏర్పాటైతే అక్కడ ఈ కళాకృతులను ఆదివాసీ యువతులు తీసుకెళ్లి విక్రయించడంతో పాటు ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తారు.

● తయారు చేసే విధానం

ముందుగా నాణ్యమైన వెదురు బొంగులను సిద్ధం చేసుకొని, వాటిని సుమారు నెల రోజుల పాటు ఎండబెట్టుకోవాల్సి ఉంటుంది. ఆ ఎండిన వెదురు బొంగులను ఒకొక్క అడుగు చొప్పున్న ముక్కలుగా కట్ చేసుకోవాలలి. ఇలా కట్ చేసిన ముక్కలను ఒక బాణీలో వేసి ఉడికించాలి. అనంతరం వాటిని తీసుకుని నీడలో కొద్దిరోజులు ఎండబెట్టాలి. అనంతరం రాఖీ సైజును బట్టి కట్ చేసుకుని ఆ ముక్కలను నున్నగా అయ్యేంత వరకు పాలిష్ చేయాలి. ఇలా తయారైన వాటికి రంగులు అద్ది భయ్యా, భాయ్ అనే అక్షరాలను గమ్ సహాయంతో అతికించాలి. మార్కెట్‌లో లభించే దారాలను వీటిని కట్టి రాఖీలుగా రూపొందించాలి. ఇలా ప్రత్యేకంగా రూపొందించిన వెదురుతో తయారైన రాఖీలను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఈ ఏడాది వెదురుతో రూపొందించిన రాఖీల్లో భాగంగా మిరప, బారకాయ, సొరకాయ వంటి పెద్ద పెద్ద సైజులో ఉండే విత్తనాలను అలంకరించడం ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి.



వెదురు ఉడికిస్తున్న దృశ్యం



మహిళలు మెడలో ధరించే అలంకరణలు

వేర్వేరు డిజైన్లతో రాఖీలు



గతేడాది వెదురుతో రూపొందించిన రాఖీలతో స్థానిక జియో మార్టు వద్ద స్టాల్‌ను ఏర్పాటు చేశాం. ఎంతోమంది కొత్తరకం రాఖీలుగా భావించి ఖరీదు చేశారు. ఇలా రెండు రోజుల్లోనే రూ.12 వేల రాఖీలను విక్రయించగలిగాం. ఒక్కొక్క రాఖీ రూ.25ల నుంచి రూ.30 ల వరకు ఉంటుంది. ఈసారి రాఖీల డిజైన్లలో భాగంగా కూరగాయల విత్తనాలను ఏర్పాటు చేశాం. ఈ ఏడాది జేకేపూర్, రాయగడలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం.

– పెద్దింటి చామంతి

స్పర్శ సహకరించింది



ఐదేళ్ల క్రితం చందిలి గ్రామంలో వెదురుతో చిన్న చిన్న వస్తువులు రూపొందించేవాళ్లం. ఇక్కడి మహిళల ప్రతిభను చూసిన స్పర్శ అనే స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి సహకరించింది. దీంతో చిన్న చిన్న యంత్ర పరికరాలను కొనుగోలు చేశాం. మొదట్లో ఐదుగురు ఈ కళాకృతులను తయారు చేస్తుండేవాళ్లం. ప్రస్తుతం ఉత్సాహంతో 20 మంది వరకు యువతులు ముందుకు వచ్చి శిక్షణ పొందారు. గతేడాది నుంచి రాఖీలను కూడా వెదురుతో రూపొందిస్తున్నాం. ఒర్మాస్ సంస్థ కూడా మాకు అండగా ఉండి ప్రోత్సహిస్తోంది.

– మమత హుయిక, శిక్షణ తరగతుల నిర్వాహకురాలు

ఆదరణ ఉంది



మేము స్వయంగా తయారు చేసిన రాఖీలను మేమే విక్రయిస్తుండడం చాలా సంతోషంగా ఉంది. లాభాల మాట పక్కన పెడితే మాలో ప్రతిభ అందరికీ తెలుస్తుందన్న ఉద్దేశంతో ఈ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. చదువుతో పాటు ఇటువంటి తరహా చేతివృత్తి పనులు చేసి కొంతవరకు ఉపాధి పొందుతుండడం ఆనందంగా ఉంది.

– పెద్దింటి లక్ష్మి

అవకాశాలు కల్పిస్తున్నాం

గత మూడేళ్లుగా చందిలి గ్రామంలోని ఆదివాసీ యువతులు రూపొందిస్తున్న వెదురు కళాకృతులకు ఒర్మాస్ ద్వారా మార్కెటింగ్ చేసేందుకు అవకాశాలు కల్పిస్తున్నాం. వారి ప్రతిభకు అద్దంపట్టే విధంగా కళాకృతులు రూపొందిస్తుండడంతో మంచి గిరాకీ ఉంది. వేర్వేరు ప్రాంతాలకు ప్రతీ ఏడాది సుమారు రూ.లక్ష ఉత్పత్తులను ఎగుమతులు చేస్తున్నాం. ప్రభుత్వం తరుపున వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేస్తున్నాం.

– మనోజ్ కుమార్ పాత్రో, ఒర్మాస్ మేనేజర్, రాయగడ శాఖ



ఈ ఏడాది స్పెషల్ డిజైన్ రాఖీల మధ్య విత్తనాలు

సెంచూరియన్ వర్సిటీతో జీఏఏ ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

పర్లాకిమిడి: ఒడిశాలోని గోపబంధు అడ్మినిస్ట్రేటివ్ అకాడమీ (జీఏఏ) సెంచూరియన్ వర్సిటీతో అకాడమిక్, పరిశోధన, మరియు శిక్షణపై శనివారం ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకుందని వర్సిటీ ప్రెసిడెంట్ డా.ముక్తికాంత మిశ్రా తెలియజేశారు. ఈ ఒప్పందంపై ఒడిశా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ డాక్టర్ శశాంక్ గ్రహాచార్య మరియు సెంచూరియన్ వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ముక్తికాంత మిశ్రాలు ఖుర్దాలోని జట్నీ క్యాంపస్‌లో సంతకాలు చేశారు. ఒడిశా రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు పరిపాలనా విభాగంలో కొత్త నైపుణ్యం, శిక్షణ అందిస్తామని జీఏఏ డైరెక్టర్ జనరల్ రాజ్‌కుమార్ శర్మ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కమిషనర్ డా.హిమాంశు భూషణ్ పండా, డిప్యూటీ జనరల్ జీఏఏ డాక్టర్ పి.కె.మిశ్రా, సెంచూరియన్ వర్సిటీ ప్రొఫెసర్ కె.వి.డి.ప్రకాష్, జాయింట్ డైరెక్టర్ కన్నన్ బాలా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6.40 లక్షల బ్రౌన్ షుగర్ సీజ్

బరంపురం: నగరంలో రోజురోజుకీ బ్రౌన్ షుగర్ మాఫియా విస్తరిస్తోంది. బరంపురం–గోపాల్‌పూర్ రహదారి మధ్య బరంపురం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 42 గ్రాముల బ్రౌన్ షుగర్ సీజ్ చేసిన ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎక్సైజ్ అధికారి రబింద్ర నారాయణ నాయక్ తెలిపిన వివరాలు మేరకు.. బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి గోపాల్‌పూర్ రహదారి జంక్షన్‌లో బ్రౌన్ షుగర్ చలామని అవుతున్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ బృందంతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో బ్రౌన్ షుగర్ సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అరెస్టైనవారు భరత్ సాహు, నిమాజ్ ఖాన్‌లుగా గుర్తించినట్టు నిర్ధారించారు. సీజ్ చేసిన బ్రౌన్ షుగర్ విలువ సుమారు రూ.6.40 లక్షలు ఉంటుందని వెల్లడించారు.



అరెస్టైన నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

10 కిలోల గంజాయి సీజ్

బరంపురం రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 10 కిలోల గంజాయి సీజ్ చేసి, ఒక నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు కున్నా డకువాగ గుర్తించారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని అధికారి రబింద్ర నారాయణ నాయక్ తెలియజేశారు.

పేదల అభ్యున్నతే సీఎం నవీన్ ధ్యేయం

- 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్
- వివిధ జిల్లాల్లో విస్తృత పర్యటన

బరంపురం:

రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతే సీఎం నవీన్ పట్నాయక్ ధ్యేయమని 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ అన్నారు. గంజాంలోని అస్కా నియోజకవర్గంలో శనివారం ఆయన పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటిసారిగా గంజాం జిల్లాలో ఎన్ఏసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పరిధిలో 2000 మందికి 'భూమి అధికారి' పట్టాల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రజలను ఆదుకునేందుకు సీఎం ఎల్లప్పుడు ముందుంటారని పేర్కొన్నారు. గడిచిన 23 ఏళ్ల బీజేడీ పాలనలో 50కి పైగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వెల్లడించారు. తొలి దశలో 2.5 లక్షల మందికి 'భూమి అధికారి' పట్టాలు పంపిణీ చేయడమే లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. పట్టాలతో బ్యాంక్ రుణాలు, పిల్లల చదువులకు రుణాలు పొందవచ్చన్నారు. అనంతరం తరతరణి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. గంజాం జిల్లాలోని 157 కళాశాలలు మరియు పాఠశాలల అభివృద్ధికి రూ.180 కోట్లు విడుదల చేశారు. నీటి పారుదల, వ్యవసాయ రంగం మరియు సంక్షేమ ఆరోగ్య పథకాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బరంపురం: మాట్లాడుతున్న 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్

– గజపతిలో ఆకస్మిక పర్యటన

పర్లాకిమిడి: రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కె.పాండ్యన్ శనివారం ఉదయం ఆరు గంటలకు గజపతి జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, ఏడీఎం రాజేంద్ర మింజ్ ఇతర శాఖల అధికారులతో అత్యవసరంగా కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మే నెలలో వచ్చినప్పుడు ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతులపై సమీక్షించారు. మొత్తం 789 వినతులకు 725 పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. మరో 64 అర్జీలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గంజాం, గజపతి, రాయగడ, ఛత్తీస్‌ఘడ్‌ను కలుపుతూ నిర్మించనున్న నాలుగు వరుసల బిజూ ఎక్స్‌ప్రెస్ వే, ఆర్.ఉదయగిరిలో ఛెలిగడ జల విద్యుత్ ప్రాజెక్టు, రూ.6.14 కోట్లతో నిర్మించనున్న సంస్కృతి భవన్, కృష్ణ, రామ, గజపతి సాగరాల పునరుద్ధరణ పనులు, వివిధ ఉన్నత పాఠశాలలకు స్మార్ట్ క్లాసులకు కేటాయించిన రూ.11 కోట్ల తదితర పనులకు సంబంధించి సమీక్షించారు. సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి వినీల్ కృష్ణ, సీడీఎంవో డా.పాత్రో తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని పాండ్యన్ సందర్శించి రోగులతో మాట్లాడారు.



బరంపురం: తరతరణి కొండపై పూజారుల వినతిపత్రం పరిశీలిస్తున్న పాండ్యన్



పర్లాకిమిడి: ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న పాండ్యన్

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



లలిత్ కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

బరంపురం: గంజాం జిల్లా సాంస్కృతిక విభాగం అధికారిగా లలిత్ కుమార్ బెహరా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆధ్వర్యంలో బాధ్యతలు శనివారం స్వీకరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు ఆయనను కలిసి అభినందించారు.

ఐదుగురు డాక్టర్ల నియామకం



గుణుపూర్ ఆస్పత్రి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో మరో ఐదుగురు డాక్టర్లను నియమిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. నియమితులైన డాక్టర్లలో మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ జితేంద్ర కుమార్ పాణిగ్రహి, సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ సమరేంద్ర సతపతి, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ అభిషేక్ మిశ్రో, దంతవైద్య నిపుణుడు డాక్టర్ బదిష్టత పట్నాయక్, అనస్తీసియా డాక్టర్ శివాంగి మహంతిలు ఉన్నారు. కొత్తగా నియమితులైన వారితో కలిపి గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో డాక్టర్ల సంఖ్య 18కు చేరుకుంది. వీరిలో 9 మంది ఎంబీబీఎస్ వైద్యులు కాగా, మిగతా 9 మంది స్పెషలిస్టులు ఉన్నారు. అయితే ఆస్పత్రిలో చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ నియామకం కోసం ఈ ప్రాంత ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి



మృతి చెందిన మేక పిల్లలు

సాలూరు: కుక్కల దాడిలో మేక పిల్లలు మృతి చెందిన సంఘటన పట్టణంలో వైటీసీ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పట్టణంలో రాజులవీధికి చెందిన మేకల కాపరి పిలమూడి రాము తన మేకలను శనివారం స్థానిక వైటీసీ సమీపంలో పాక నుండి మేతకు తరలించాడు. అనంతరం రాము కుటుంబీకులు పాకను శుభ్రపరిచి రోజులు వయస్సు గల మేక పిల్లలను పాకలో ఉంచారు. ఈ క్రమంలో మధ్యాహ్నం పాక వెనుక నుండి కొన్ని వీధి కుక్కలు వెళ్లి మేక పిల్లలపై దాడి చేశాయి. ఈ దాడిలో 31 మేక పిల్లలు మృతి చెందాయి. దీంతో రాము, కుటుంబీకులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. వీటి మీదే జీవనాధారంగా బతుకుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ కళాశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కొత్తవలస: మండలంలోని చింతలదిమ్మ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం ఆక్రమణపై కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భీమశంకరరావు కొత్తవలస పోలీసులు, రెవెన్యూ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. కళాశాల ముఖద్వారం వద్ద గుడినిర్మిస్తే విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రహరీ నిర్మాణానికి నాడు-నేడు కార్యక్రమం కింద నిధులు మంజూరయ్యాయని, నిర్మాణానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల సెలవు దినాల్లో ఆక్రమణలకు పాల్పడుతున్నారని, కళాశాల స్థలానికి రక్షణ కల్పించాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఒక బృందావనం.. సోయగం

- వైభవంగా ఊంజల యాత్ర
- కళకళలాడుతున్న శ్రీక్షేత్రం
- వారం రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు

భువనేశ్వర్: ఏడాదికి 12 నెలల్లో 13 జాతరలు జరుపుకునే శ్రీజగన్నాథునికి శ్రీమందిరంలో మరెన్నో ఉప జాతరలను నిర్వహించడం ఆనవాయితీ. అశేష భక్తజనాన్ని మురిపించేందుకు స్వామివారు ఏడాది పొడవునా పలు పండగపబ్బాలు, జాతరలు, ఉత్సవాలు జరుపుకుంటాడని భక్తజనం కొనియాడుతుంది. ఇలా భక్తులను ఆనందింపజేసే నానా కాలపు జాతరల్లో ఒకటిగా పేరొందిన ఝులన్ జాతర శనివారం నుంచి ప్రారంభమైంది. ఏటా శ్రావణ శుక్ల దశమి మొదలుకొని భాద్రపద కృష్ణ ప్రతిపద వరకు వారం రోజులపాటు కొనసాగుతుంది.

ఆకర్షణీయంగా మండపాలు

శ్రీ క్షేత్రం ఊంజల యాత్రతో కళకళలాడుతోంది. వారం రోజుల పాటు కొనసాగే జాతర కోసం అత్యంత ఆకర్షణీయమైన ఊంజల మండపాలు రూపుదిద్దుకున్నాయి. ప్రధానంగా స్థానిక మఠాలు ప్రత్యేక శోభతో శోభిల్లుతున్నాయి. ఈ వ్యవధిలో పూరీ శ్రీజగన్నాథుడిని దర్శించేందుకు విచ్చేసే వారికి ఈ యాత్ర దృశ్యాలు చూడ ముచ్చటగొలిపిస్తాయి. స్వామివారు కొలువుదీరిన శ్రీమందిరంతో పాటు ఈ పుణ్యక్షేత్రంలో జగన్నాథ సంస్కృతితో ముడిపడిన ప్రతి మఠంలో ఈ యాత్ర ఝులన్ జాతరగా నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో కొంతమంది ఇండ్లలో అత్యంత ఆనందోత్సాహాలతో ఊంజల యాత్ర జరుపుకుంటారు. ఏడు రోజులే పాటు కొనసాగే ఈ యాత్ర పరిసరాలకు కొత్త సొబగులు తొడుగుతుంది.

ముక్తి మండపం వేదిక

శ్రీజగన్నాథుని ప్రధాన ఆలయం ఆవరణలో నెలకొన్న ముక్తి మండపం వేదికగా ఝులన్ జాతర నిర్వహిస్తారు. శ్రీకృష్ణుని రాసలీలకు ప్రతీకగా నిర్వహించే ఈ ఉత్సవం చూపరులకు విశేషంగా ఆకట్టుకుంటుంది. నిత్యం మధ్యాహ్న ధూపదీప సేవ అనంతరం ముక్తి మండపం ఊయలపై భూదేవి, శ్రీదేవి సమేతంగా మదనమోహనుడు ఆశీనుడవుతాడు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాదులు నిర్వహించడం ఆచారంగా కొనసాగుతుంది. రత్న వేదిక నుంచి శ్రీజగన్నాథుని ఆజ్ఞామాల అందడంతో పల్లకిలో శ్రీదేవీ, భూదేవి సమేతంగా మదన మోహనుడు ఊంజల మండపానికి వేంచేస్తాడు. శ్రీమందిరం ప్రధాన సముదాయం ముక్తి మండపం ఝులన్ జాతర వేదికపై ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊయలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సింహాసనంపై మూర్తులను ఆశీనులు చేస్తారు. బృందావనంలో ప్రకృతి శోయగ పొదల మాటున రాధాకృష్ణులు ఊయలలో ఊగుతున్నట్లు రూపుదిద్దుకున్న అలంకరణ అత్యంత ఆకర్షణీయంగా ఆకట్టుకుంటుంది. దీనిపై దేవీ, భూదేవి సమేతంగా మదన మోహనుడు ఊయల ఊగడం ఊంజలోత్సవం సంక్షిప్త ఇతివృత్తం. దీనిని శరత్ రాస్ అని కూడా పేర్కొంటారు.



పూరీలో ఏర్పాటు చేసిన ఊంజల జాతర మండపాలు


నెల రోజుల ముందుగా

దాదాపు ఒక నెల రోజులు ముందు నుంచే ఊంజల కుంజం తయారీకి శ్రీకారం చుడతారు. దీని తయారీలో జరీ, జీలుగు, రంగు కాగితాలు, కొత్త వస్త్రాలు వినియోగించి కుంజం ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. నిర్వాహకులు పోటాపోటీగా ఆకర్షణీయమైన అలంకరణతో కళా ప్రతిభని ప్రదర్శిస్తారు. జంతువులు, పక్షులు మరియు వివిధ మొక్కలు మరియు సువాసనగల పువ్వులు మరియు పండ్లతో చేసే ఈ అలంకరణ కనులు మిరమిట్లు గొలిపిస్తుంది.



మఠాల్లో సందడే సందడి

ఝులన్ యాత్ర పురస్కరించుకుని పూరీలోని మఠాల్లో ఉత్సవ సందడి నెలకొంది. భారీ అలంకరణతో మఠాల ఆవరణలు ప్రత్యేక శోభని సంతరించుకున్నాయి. అద్భుతమైన నేపథ్యాలతో దైవిక జంట కృష్ణుడు మరియు రాధ విగ్రహాలను అందంగా అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ తరహాలోనే పలువురు ఇంటి ఆవరణలో ఊంజల జాతర ఏర్పాట్లు చేసి సందర్శకుల్ని ఆకట్టుకోవడం విశేషం. ప్రత్యేక సింహాసనంపై ఆశీనులైన రాధాకృష్ణులను ఊయలలో ఊపి ప్రసన్నం చేసుకోవడంతో సందర్శకులు ఆనందోత్సాహాలతో పాలుపంచుకుంటున్నారు. పువ్వుల నుంచి ఆభరణాల వరకు పలు రకాల సామగ్రితో ఊయలను వివిధ ఆకర్షణీయమైన అంశాలతో అలంకరించారు. శ్రీక్షేత్రంలో దాదాపు అన్ని ప్రధాన మఠాలు ఈ వేడుకను జరుపుకుంటున్నాయి. బొడొ ఒడియా మఠం, గొరావిహార్ మఠం, జగన్నాథ్ వల్లభ మఠం, గోపీనాథ్ యాదుల మఠం ఇలా పలు మఠాలు ఊంజల యాత్రతో కళకళలాడుతున్నాయి. ప్రకృతి సహజమైన పొదల చాటున ఊయలలూగుతున్న రాధాకృష్ణులు, మరి కొన్నిచోట్ల బృందావనం దృశ్య పోలికలతో అలంకరణ కనువిందు చేస్తుంది. కొన్ని మఠాలు అలంకరణలో వెండి, బంగారు పూత సరంజామాతో అట్టహాసంగా తీర్చిదిద్దారు. సాధారణంగా స్థానిక కళాకారులు జరీ మరియు జీలుగుతో తయారు చేసిన సామగ్రిని ఊంజల వేదిక అలంకరణలో వినియోగిస్తారు. దాదాపు ప్రతి మఠం వారి ఊయల వేదికలో గొల్ల భామల నృత్య భంగిమలు, పలు పౌరాణిక పాత్రల కొయ్య, మట్టి బొమ్మల్ని వినియోగించడం విశేషం.



భారీగా గంజాయి స్వాధీనం



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

- ఏడుగురు వ్యక్తులు అరెస్టు

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీసులు మునిగడ రైల్వేస్టేషన్ వద్ద గంజాయితో నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 59.440 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టుకు తరలించారు. మునిగుడ పోలీసుస్టేషన్ ఎస్ఐ చక్రధర్ బెహర తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు రైల్వేస్టేషన్ వద్ద దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని పట్టుకొని తనిఖీలు నిర్వహించగా గంజాయి బయటపడింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు జిల్లాలోని చంద్రపూర్‌కు చెందిన అరుణ్ సుంద్రుక(31), బైకుంఠ సునో(28), తెరువలికి చెందిన ప్రీతం మహానందియా (34), ప్రశాంత్ నందో(28)లుగా గుర్తించారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు, గంజాయి

రాయగడ: కందమాల్ నుంచి కలహండి మీదుగా బైకుపై గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను మునిగుడ పోలీసులు శనివారం సాయంత్రం పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు సంచుల్లో 23.920 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో మునిగుడ పోలీసుస్టేషన్ పరిధి మాదాగుడ గ్రామానికి చెందిన సురేంద్ర బెద్రక, ప్రశాంత్ దిబాక, కంధమాల్ జిల్లాలోని బలిగుడ ప్రాంతానికి చెందిన సిరాయి దిగాల్ ఉన్నట్లు గుర్తించారు. జిగిడి కూడలిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బైకుపై గంజాయితో వీరు పట్టుబడినట్లు వెల్లడించారు.

కొండరాళ్ల బ్లాస్టింగ్

- ఇద్దరు కార్మికులు మృతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ బొందగురడో గ్రామ సమీపంలోని క్రషర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు కొండరాళ్ల బ్లాస్టింగ్‌లో మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. కొండరాళ్ల బ్లాస్టింగ్ జరిగినప్పుడు గంజాం జిల్లా రంభ సమితి ఝోరెడీ రాధా గోవిందపూర్ గ్రామానికి చెందిన మధుర నాయక్ (52), మధురచువా గ్రామానికి చెందిన విష్ణుప్రసాద్ నాయక్‌లు పర్యవేక్షించారు. ఈ సమయంలో పెద్ద రాయి వారి మీద పడడంతో మృత్యువాత పడ్డారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని రాళ్లకింద నుజ్జునుజ్జయిన మృతదేహాలను తీయగలిగారు. మేనమామ, మేనల్లుడు అయిన మధురనాయక్, విష్ణుప్రసాద్ నాయకలు గత ఐదేళ్లుగా క్రషర్‌లో పనిచేస్తున్నారు. ఘటనపై ఐఐసీ బసంత కుమార్ సెఠి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



రాళ్ల వద్ద మృతదేహాల కోసం గాలిస్తున్న దృశ్యం

ఆశ్రమ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలి

విజయనగరం అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన డిప్యూటీ డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. భాషా పండితులు, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సీనియర్ ఉపాధ్యాయులకు నోషనల్ సీనియార్టీ కల్పించాలని, ఇద్దరు ప్రధానోపాధ్యాయులను డైరెక్టరేట్‌లో సరెండర్ చేయు విధానాన్ని రద్దు చేయాలన్నారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గేదెల శేషగిరిరావు, ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం, ఏఎస్ఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.రామారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బారావు ఉన్నారు.



వినతిపత్రం అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

మద్యానికి బానిసై...

విజయనగరం క్రైమ్: మద్యానికి బానిసై, తిండి తిప్పల్లేక ఇంట్లో పడి మృత్యువాతకు గురైన వ్యక్తి ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు, అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక స్టేడియం కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న పెనుమజ్జి సూర్యనారాయణమూర్తి (40) మద్యానికి బానిసయ్యాడు. పగలు, రాత్రీ తేడా లేకుండా మద్యం సేవిస్తూ, తిండి, తిప్పల్లేక గత నాలుగు రోజులు నుంచి ఇంట్లోంచి బయటకు రాలేదు. అయితే శుక్రవారం నుంచి అతను ఉంటున్న ఇంటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు అతని మేనల్లుడుకి సమాచారమిచ్చారు. దీంతో అతను వచ్చి పరిశీలించి సచివాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారమిచ్చాడు. టుటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అప్పటికే మృతి చెంది నాలుగు రోజులైనట్లు గుర్తించారు. మృతదేహాన్ని కేంద్రాస్పత్రికి తరలించారు. ఏఎస్ఐ పైడితల్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

శృంగవరపుకోట: మండలంలో అమ్మపాలెం గ్రామానికి చెందిన వన్నెపురి శ్రీనివాసరావు(45) శుక్రవారం రాత్రి ఒంటి గంట సమయంలో మృతి చెందినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు చెప్పారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అమ్మపాలెం గ్రామానికి చెందిన వన్నెపురి శ్రీనివాసరావు(45) అనారోగ్యంతో కొంత కాలంగా ఇబ్బంది పడుతున్నాడు. కాళ్లు చేతులు సక్రమంగా పని చేయవు. ఈ క్రమంలో మద్యానికి బానిస అయ్యాడు. శుక్రవారం రాత్రి భార్య అతనితో మాట్లాడుతూ మనకి ఇద్దరు ఆడబిడ్డలు ఉన్నారు.. నీకు ఆరోగ్యంగా సరిగా లేదు.. మద్యం తాగి మరింత అనారోగ్యానికి గురైతే ఎలాగని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మద్యం మత్తులో గడ్డి మందు శుక్రవారం మధ్యాహ్నం తాగాడు. వెంటనే శ్రీకాకుళం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి శ్రీనివాసరావు మృతి చెందినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నిలకడగా తోటపల్లి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు

గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నాగావళి నదిలో నీటిప్రవాహం నిలకడగావుంది. శనివారం సాయంత్రానికి 105 మీటర్లకు 104.14 మీటర్ల మేర ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నది నుంచి ప్రాజెక్టులోకి 2,553 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అధికారులు ఒక గేటును ఎత్తివేసి 1,827 క్యూసెక్కుల నీటిని నదిలోకి, కాలువల ద్వారా 1,420 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టువద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

29న మెగా జాబ్‌మేళా



మెగాజాబ్ మేళా వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగు కళాశాలలో ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.జాషువాజయప్రసాద్ తెలిపారు. జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను కళాశాలలో వారు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతీ కళాశాల, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తుందని తెలిపారు. మేళాలో ఐటీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఫార్మా,బ్యాంకింగ్, ఆటోమొబైల్స్ తదితర రంగాలకు సంబంధించి టెక్ మహీంద్ర, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంకు, హెటరోడ్రగ్స్, జయభేరి ఆటోమోటివ్ ప్రైవేటు లిమిటెడ్, సైనస్టిక్స్ లాబ్స్ అల్ట్రాటెక్ సిమెంటు, వరుణ్ మోటార్స్ వంటి 16 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, రాజాం, నెల్లిమర్ల, విజయనగరం, లావేరు తదితర ప్రాంతాల్లో ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమో, బి.టెక్, ఎం.టెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 63004 95265, 88862 87495 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు కోరారు. ఇదే విషయమై స్థానిక కోర్టు సముదాయంలో బార్‌అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ ఒక మంచి అవకాశమని, రాజీకి అనుకూలమైన కేసుల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలన్నారు. కక్షిదారులు కూడా రాజీమార్గాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి.కృష్ణసాయి తేజ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.భవానీ ప్రసాద్, ఏజీపీ ఎస్.పోలారావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చకస్వాములు



వెండి మండపం వద్ద కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం, సుదర్శన అష్టక హవనం తదితర హోమాలను జరిపించారు. అనంతరం స్వామివారి వెండి మండపం వద్ద నిత్యకల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ ప్రారంభం



ఏబీఎస్ వ్యవస్థను ప్రారంభిస్తున్న అధికారులు

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలోని వాల్తేర్ డివిజన్ అలమండ, కోరుకొండ, విజయనగరం స్టేషన్‌ల మధ్య ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ (ఏబీఎస్) వ్యవస్థను రైల్వే అధికారులు శనివారం ప్రారంభించారు. కొత్త సిస్టమ్ పాత ప్యానల్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌ను భర్తీచేస్తుంది. కొత్త ఏబీఎస్ వ్యవస్థ 17 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తుంది. రైలు కదలికలను స్వయంచాలకంగా నియంత్రిస్తుంది. మెరుగైన రవాణా సామర్థ్యాన్ని పెంచుతుంది. అప్‌గ్రేడ్ రద్దీగా ఉండే సెక్షన్లలో మరిన్నిరైళ్ల నిర్వహణను సులభతరం చేయడంతో పాటు మొత్తం భద్రతను ఏబీఎస్ మెరుగుపరుస్తుంది. ఏబీఎస్ పనులను త్వరగా పూర్తిచేసిన రైల్వేబృందాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి అభినందించారు.

క్లుప్తంగా

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి సరెండర్

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీతులసిని వైద్య శాఖ ఉన్నతాధికారులకు సరెండర్ చేస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకపోవడంతోనే సరెండర్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇటీవల వైద్యారోగ్య శాఖ సమీక్షలో భాగంగా టెక్కలి డివిజన్‌తో పాటు పలాస డివిజన్‌లోని ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ కేసుల పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించాలని లక్ష్మీతులసిని కలెక్టర్ ఆదేశించారు. అయినప్పటికీ ఆమె బాధ్యతలను స్వీకరించకుండా.. ఆరోగ్యం సహకరించడం లేదంటూ లేఖను పంపించారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ఆమెను సరెండర్ చేస్తూ వైద్యశాఖ డైరెక్టర్‌కు సమాచారాన్ని పంపించారు. దీనిపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి వద్ద ప్రస్తావించగా.. కలెక్టర్ ఆదేశాలను పాటించకపోవడంతోనే నిర్ణయం తీసుకున్నారని ధ్రువీకరించారు.

'వివాద రహిత గ్రామాలను గుర్తించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వివాద రహిత గ్రామాలను గుర్తించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన శనివారం తన చాంబర్‌లో రెవెన్యూ, పోలీస్ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గ్రామాలన్నీ సర్వే చేయాలని సూచించారు. సివిల్, క్రిమినల్, ఇతర గొడవలు లేని గ్రామాలను గుర్తించాలన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మోడల్ గ్రామాలను గుర్తించాలని తెలిపారు. వివాదేతర గ్రామాలుగా గుర్తించడానికి అవకాశం ఉన్న గ్రామాల పేర్లు సూచించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి, డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తించిన నల్లతాచు



మందసలో భయపెట్టిన నల్లతాచు

మందస: మందసలో భారీ నల్లతాచు శనివారం స్థానికులను భయపెట్టింది. పట్టణంలోని వాసుదేవ స్వామి ఆలయం సమీపంలోని కూరగాయల తోటలకు శనివారం ఉదయం స్థానికులు పనికి వెళ్తుండగా చలనం లేకుండా పడి ఉన్న 14 అడుగుల నల్లతాచు కనిపించింది. సర్పాన్ని చూసిన వెంటనే వారు హడలెత్తిపోయారు. కాస్త పరిశీలనగా చూసి మరణించిందని నిర్ధారించుకున్నారు. ఆ పామును చూసేందుకు స్థానికులంతా అక్కడకు వచ్చారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జువాలజీ అధ్యాపకుడు చింతాడ శరత్‌బాబు మాట్లాడుతూ ఇది అరుదైన కింగ్ కోబ్రా అని, దీనినే రాచనాగు అనికూడా పిలుస్తారన్నారు. దీని జాతి పేరు ఓఫియోఫేగస్ అని, సుమారు 18 నుంచి 20 అడుగుల వరకు పెరుగుతుందని, జీవితకాలం 20 ఏళ్లన్నారు. ఇది సిగ్గరి అని, ఎవరి కంట పడడానికి ఇష్టపడదని, నాగుపాములు, ఇతర పాములను ఆహారంగా తీసుకుంటుందన్నారు.

స్టూడెంట్ ఇన్ పాలిటిక్స్ షూటింగ్ సందడి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని చిలకపాలెంలో శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం స్టూడెంట్స్ ఇన్ పాలిటిక్స్ సినిమా షూటింగ్ సందడి నెలకొంది. దర్శకుడు గూన అప్పారావు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ ప్రిన్సిపాల్‌గా నటిస్తున్నారు. కెమెరామేన్ వెంకట్ చిత్రీకరించగా, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు సహకరించారు.

బూరవల్లిలో కేంద్ర బృందం పర్యటన

గార : మండలంలోని బూరవల్లి గ్రామంలో శనివారం మనోజ్ కుమార్ ఆధ్వర్యంలోని కేంద్ర బృందం పర్యటించింది. వివిధ కుటుంబాల వ్యక్తిగత మరుగుదొడ్లు, ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం తీరు, చెత్త సేకరణ తదితర అంశాలను సర్పంచ్ మళ్ల కాసులమ్మ నారాయణమూర్తి, మండల విస్తరణాధికారి (పీఆర్ అండ్ ఆర్‌డీ) పి.శ్రీనివాసరావులతో కలిసి స్వయంగా పరిశీలించారు. వీరితో పాటు డీపీఆర్సీ జిల్లా రిసోర్సు పర్సన్ బి.పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ స్వచ్ఛ భారత రిసోర్సు పర్సన్ అమ్మోజీ, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేలు కళయిక

సత్సంప్రదాయ నృత్యం నేర్చుకోవాలని, వేదికలపై ప్రదర్శనలు ఇవ్వాలని ఎందరో కలలు కంటారు. కానీ చాలా మంది అమ్మాయిల కలలు కంటి కాటుక వెనుకే చీకటిలో కలిసిపోతాయి. కొందరు మాత్రం అమ్మలయ్యాక ఆ కల నెరవేర్చుకుంటున్నారు. మనసుతో పాటు శరీరానికీ సాంత్వన ఇచ్చేందుకు శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని శివశ్రీనృత్యనికేతన్, అభినయ నృత్య కళానికేతన్ తదితర సంస్థలు ఇందుకు వేదికలవుతున్నాయి. పిల్లలకు నాట్యం నేర్పించడానికి వచ్చి తల్లులు కూడా నృత్యం నేర్చుకుంటున్నారు. వీరి కోసం శిక్షకులు ప్రత్యేక రీతిలో తర్ఫీదు అందిస్తున్నారు. ఆశ, ఆరోగ్యాల మేలు కలయికగా ఇక్కడ శిక్షణ సాగుతోంది.





శిక్షణ పొందుతున్న మహిళలు

- నాట్యకళపై మహిళలకు పెరుగుతున్న ఆసక్తి
- 26 రకాల పాదకర్మలతో విద్య
- నృత్యంతో స్త్రీలకు ఆరోగ్య యోగం

శ్రీకాకుళం కల్చరల్:

జిల్లా కేంద్రంలోని నృత్య శిక్షణ కేంద్రాలు కొత్త తరహా విధానాలకు తెర తీస్తున్నాయి. స్త్రీలకు పిల్లలు పుట్టాక వచ్చే సమస్యలను దూరం చేయడానికి నృత్యాన్ని ఓ థెరపీగా అందిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో పిల్లలకు నృత్యం నేర్పిస్తూనే తల్లులకు కూడా శిక్షణ అందజేస్తున్నారు. నాట్య గురువు శ్రీకాంత్ ఇందుకోసం ప్రత్యేకంగా 26 రకాల ప్రత్యేక పాదకర్మ(స్టెప్స్)తో నేర్పుతున్నారు. పాదాలు నేలను తట్టేటప్పుడు నెమ్మదిగా చేస్తూ సాధన చేయాలి. ఇలా ముందుగా సాధన చేస్తే మొదట్లో నరాలు స్వాధీనం అవుతాయి. ఆ తర్వాత ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఆయన చెబుతున్నారు.

స్త్రీల సమస్యలు దూరం

మహిళల్లో ప్రసవానంతరం శరీరంలో పటుత్వం తగ్గుతుంది. బరువు పెరుగుతారు. అరికాళ్ల మంటలు, మోకాళ్ల నొప్పులు, పాదాల నొప్పులు, గైనిక్ సమస్యలు, తలనొప్పి, స్త్రీలకు వచ్చే నెలసరి వల్ల నడుం నొప్పులు వస్తుంటాయి. ఈ సమస్యలన్నింటికీ ఈ నాట్య విద్య పరిష్కారం చూపిస్తోందని నేర్చుకుంటున్న వారు అంటున్నారు. దీనివల్ల మానసిక దృఢత్వం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని చెబుతున్నారు.

వయసుతో సంబంధం లేదు..

చిన్నతనంలో నాట్యం నేర్చుకోవాలని ఆశ పడి నేర్చుకోలేకపోయిన వారు ఇప్పుడు ఆ కలను నెరవేర్చుకోవడం శుభ పరిణామంగా చెప్పుకోవచ్చు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గల శివశ్రీ నృత్య కళానికేతన్ నృత్య దర్శకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ దర్శకత్వంలో నాట్య విద్యను అభ్యసిస్తూ ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరుకున్నారు. వారందరూ తమ పిల్లలను అక్కడ నాట్య శిక్షణలో చేర్పించినవారే. ఇలా సుమారు 12మంది నేర్చుకుంటున్నారు. ప్రతి మంగళవారం, గురువారం సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు నృత్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో వీరు సాధన చేస్తున్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటలవరకు వంశధార గెస్టుహౌస్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. వీలుకాని వారికి 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

ఉత్సాహం పెరిగింది



నాట్యం మానసిక ఆనందాన్ని, ఉల్లాసాన్ని ఆరోగ్యాన్ని అందిస్తోంది. చక్కగా అని పనులు చేసుకుంటున్నాను. నాలో చెప్పలేని ఉత్సాహం కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రదర్శనలు కూడా ఇస్తున్నాను.

– డాక్టర్ వరుదు దివ్య, శ్రీకాకుళం

హాయిగా ఉంటోంది



నా భర్త రామం వైద్యులు. నన్ను నాట్యం నేర్చుకోమని ప్రోత్సహించారు. ప్రదర్శన కోసం కాకుండా వాటిపై గల మక్కువతో సాధన చేస్తున్నాను. అయితే మా మాస్టారు మమ్మల్ని ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి తీసుకొచ్చారు. దీని వల్ల కొన్ని రకాల సమస్యలు దూరమయ్యాయి. నాట్యం చేశాక రోజంతా హాయిగా ఉంటోంది.

– ప్రియంవద, శ్రీకాకుళం

నా కూతురికి నేర్పిస్తూ..



నాకు చిన్నతనం నుంచి నాట్యంపై చాలా ఇష్టం ఉంది. నేను చదువుకునే రోజుల్లో నాకు నేర్చుకునే అవకాశం రాలేదు. నా కుమార్తెకు ఇక్కడ నృత్యం నేర్పించేందుకు చేర్చాను. నా వయసు వాళ్లు కూడా నేర్చుకుంటూ ఉండడంతో నేనూ చేరాను.

– బి.లత, శ్రీకాకుళం

ప్రత్యేక శిక్షణ అవసరం



మధ్య వయసులో ఉండే వాళ్లకు ప్రత్యేక శిక్షణ చాలా అవసరం. ఒక ప్రత్యేక టెక్నిక్‌తో వాళ్లతో నాట్య సాధన చేయిస్తున్నాను. ఎవరైనా ఈ నాట్య విద్య నేర్చుకోవచ్చనే చాలెంజ్‌తో వీరిని శిక్షణ ఇస్తున్నాను. చిన్నతనంలో వారికి తీరని కోర్కెలను ఇప్పుడు తీర్చడం నాకు చాలా ఆనందంగా ఉంది.

– నాట్యాచార్యులు డాక్టర్ శ్రీకాంత్

ప్రజా నాయకుడు బొడ్డేపల్లి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం.

సోంపేట: మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు ప్రజా నాయకుడని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సోంపేట సామాజిక ఆస్పత్రి సమీపంలో ఏర్పాటుచేసిన బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలు ప్రభుత్వం కార్యక్రమంలా నిర్వహించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు అభినందనలు తెలిపారు. జిల్లా చరిత్ర తెలుసుకోవాలంటే ఇలాంటి నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అవసరం అన్నారు. కాంగ్రెస్ పార్టీలో బొడ్డేపల్లి రాజగోపాలరావు చేరిన నాడే వంశధార ప్రాజెక్టు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ రోజు వంశధార ప్రాజెక్టు పరిధిలో పంటలు సాగు చేస్తున్నామంటే అది రాజగోపాలరావు పెట్టిన భిక్షేనని అన్నారు. జిల్లాలో పారిశ్రామిక విప్లవం తీసుకురావడానికి ఆనాడే కృషి చేశారని అన్నారు. మళ్లీ ఇప్పుడు సీఎం వైఎస్‌జగన్ ఉద్దానం కోసం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ ఆస్పత్రి నిర్మించారని తెలిపారు. విగ్రహ దాతలు డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్‌ను స్పీకర్ అభినందించారు. వంశధార నీరు ఇక్కడకు చేరితే సాగునీటి కష్టాలు తీరుతాయని డాక్టర్ ప్రధాన శివాజీ స్పీకర్‌ను కోరారు. బహుదా, వంశధార అనుసంధానికి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని స్పీకర్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజక వర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యేలు బొడ్డేపల్లి సత్యవతి, నరేష్‌కుమార్ అగర్వాల్, జిల్లాలో వైద్యులు డాక్టర్ జీవితేశ్వరరావు, డాక్టర్ సూర్యం, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైలదేవదాస్ రెడ్డి, సోంపేట, కంచిలి జెడ్పీటీసీలు తడక యశోద, ఇప్పిలి లోలాక్షి, సోంపేట, కవిటి వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షులు తడక జోగారావు, కడియాల ప్రకాష్, కంచిలి, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్లు బతకల మోహనరావు, బాబూరావు, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి పాల్గొన్నారు.

అర్జీలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనర్ సిద్ధార్థ్ జైన్

- సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనర్ సిద్ధార్థ్ జైన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందే వినతుల్లో పరిష్కారం కాని అర్జీలపై దృష్టి సారించాలని సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జగనన్నకు చెబుదాం (జేకేసీ)లో అర్జీదారుల సంతృప్త స్థాయి బాగానే ఉన్నా, మరింత సంతృప్తి కలిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ సంస్థ తదితర శాఖాధిపతులతో ఆయన శనివారం సమీక్షించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. ప్రతి అర్జీ కాలపరిమితిలోగా పరిష్కారం కావాలని, కాలపరిమితి దాటిన వాటికి సరైన కారణాలు ఉండాలని వివరించారు. ఆయన తొలుత జలుమూరు మండలం లింగాలవలసలోని గృహ నిర్మాణాలను, కరవంజలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఎచ్చెర్ల మండలం పొన్నాడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, గృహ నిర్మాణ సంస్థ, ఐసీడీఎస్ పథక సంచాలకులు ఎన్.గణపతి, డాక్టర్ జి.జయదేవి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట రామన్, నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, డీఆర్‌డీఏ పరిపాలన అధికారి దొర, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

- ఆర్టీసీ ఈడీ రవికుమార్



నాన్‌స్టాప్ పోర్టికో వద్ద ప్రయాణికుల రద్దీని పరిశీలిస్తున్న ఆర్టీసీ ఈడీ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2 డిపోలు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లను విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం డేఅండ్ నైట్ కూడలి నుంచి ఆమదాలవలస రోడ్డు విస్తరణలో ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు భాగం, డిపో గ్యారేజ్‌లో ఎంత భాగం పోతుందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నాన్‌స్టాప్ కౌంటర్, పోర్టికో వద్ద ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం గ్యారేజ్ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఆర్.ఎస్.శర్మ, డిప్యూటీ ఈఈ బమ్మిడి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ అధికారి రోణంకి వెంకటరావు, ఆర్టీసీ ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, సూపర్ వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం: ఎస్పీ



స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బందికి ప్రత్యేక రక్షణ షూలు అందజేస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన సేవలే లక్ష్యంగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ముందుకు సాగాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శనివారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ప్రత్యేక షూలు పంపిణీ చేశారు. ఈ విభాగం ప్రత్యేకమైనదని, క్లిష్ట పరిస్థితులు చక్కబెట్టే వ్యవస్థ అని అన్నారు. శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానాలు సమయంలో మెరుగైన సేవలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ప్రసాదరావు, ఆర్ఐ ఉమామహేష్ పాల్గొన్నారు.

స్కూల్‌కాంప్లెక్స్ తేదీ మార్చాలని వినతి



ఏపీసీ జయప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న పిసిని వసంతరావు

శ్రీకాకుళం అర్బన్: తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా ఈ నెల 28న జరగనున్న స్కూల్ కాంప్లెక్స్(తెలుగు)ను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు పిసిని వసంతరావు సమగ్ర శిక్ష ఏపీసీ రోణంకి జయప్రకాష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు ఈ నెల 28న తెలుగు స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించేందుకు నిర్ణయించారని, అయితే పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 23నుంచి 29వరకూ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 28న జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ 30వ తేదీకి, 29వ తేదీన జరగాల్సిన మిగతా సబ్జెక్టుల స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ 31వ తేదీన నిర్వహించుకునే వెసులుబాటు కల్పించి గిడుగు జయంతి వారోత్సవాలు విజయవంతం అయ్యేలా చూడాలని విన్నవించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: యువత ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఆరు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. పాలిటెక్నిక్ డిప్లమా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల ప్రతిభ, ఆసక్తి ఆధారంగా ఎంపిక చేసి ఉద్యోగాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ, దివ్యాంగ శాఖ అధికారి శాంతి, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు, జిల్లా నైపుణ్యాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ చదువు..
దూరవిద్యతో సులువు!

- అసంపూర్తిగా చదువులు నిలిపివేసిన వారికి అవకాశం
- రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానంగా ఓపెన్ సర్టిఫికెట్ల జారీ
- ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత
- జిల్లాలో 49 అధ్యయన కేంద్రాలు
- ఈ నెల 31 వరకు అడ్మిషన్లకు అవకాశం



ఇచ్ఛాపురం ఓపెన్‌స్కూల్ స్టడీసెంటర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

ఇచ్ఛాపురం: కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు.. ఇలా కారణాలు ఏవైతేనేం కొందరు తమ చదువులను అర్ధంతరంగా ఆపేశారు. అలాంటి వారి కల నెరవేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం కృషి చేస్తోంది. రెగ్యులర్ విధానం ద్వారా పొందిన పదో తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లకు సమానంగా ఓపెన్ స్కూల్ ద్వారా కూడా సర్టిఫికెట్లు జారీ చేస్తోంది. వీటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు కల్పిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంలో పది, ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తోంది. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో నెలకొల్పిన ఈ అధ్యయన కేంద్రాలు (స్టడీసెంటర్లు) ద్వారా 2023-24 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో 49 స్టడీసెంటర్ల ద్వారా ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో కీలకమైన పదో తరగతి, కళాశాల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించలేక మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా వారి కలలను సాకారం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందవచ్చు.

ప్రభుత్వాల గుర్తింపు..

ఓపెన్ స్కూల్ ద్వారా జారీచేసిన సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల గుర్తింపు ఉంటుంది. ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు అర్హత కలిగి ఉంటాయి. కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులు ఎంతోమంది దేశ రక్షణ దళాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఆశావర్కర్లుగా, అంగన్‌వాడీ కార్యకర్తలుగా, నర్సులుగా సేవలందిస్తున్నారు..

అడ్మిషన్ విధానం..

- అడ్మిషన్ సమయానికి అంటే ఆగస్టు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి.
- స్టడీసెంటర్‌లో సూచించిన ఏదైన మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యయన ప్రణాళికలో సూచించిన గ్రూపుల లిస్టు నుంచి ఏవైనా ఐదు సబ్జెక్టులను ఎంపిక చేసుకోవాలి.
- గ్రూప్ ఏ నుంచి ఇంగ్లీషు తప్పనిసరి. ఇంటర్మీడియట్ సైన్స్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వారు 10వ తరగతిలో తప్పనిసరిగా గణితం, జనరల్ సైన్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి.
- అభ్యాసకుని ఆసక్తి మేరకు అదనంగా ఆరో సబ్జెక్టు కూడాఅడ్మిషన్ సమయంలోనే ఎంపిక చేసుకోవచ్చు.
- ఓపెన్‌స్కూల్లో అడ్మిషన్ పొందినప్పటి నుంచి 5 ఏళ్ల వరకు ప్రవేశం చెల్లుబాటు అవుతుంది.
- స్టడీసెంటర్‌లో 30 రోజులు తరగతులకు అభ్యాసకులు హాజరుకావాల్సి ఉంటుంది.
- ఇతర బోర్డుల ద్వారా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన వారు, ప్రస్తుత విద్యాసంవత్సరం చదువుతున్న వారు ఓపెన్ స్కూల్లో చేరేందుకు అనర్హులు. ఈ విషయాన్ని దాచి పెట్టి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొంది ఉత్తీర్ణత పొందితే వారి సర్టిఫికెట్లను ఎలాంటి నోటీసు లేకుండానే రద్దు చేస్తారు. చట్టపరమైన చర్యలు తీసుకొంటారు.

సద్వినియోగం చేసుకోండి..



ఓపెన్‌స్కూల్స్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. వివిధ కారణాల వల్ల మధ్యలో చదువులు ఆపేసిన వారు, ఇంటర్మీడియట్ పూర్తి చేయని వారికి ఓపెన్ స్కూల్ మంచి అవకాశం. నిర్ణీత గడువులో అడ్మిషన్లు పొందాలి.

– లియాఖత్ అలీఖాన్, ఓపెన్‌స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ / ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్